సాక్షి ఒడిశా
శనివారం, 25, మార్చి, 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,28,523లు, బంగారం 400 మిల్లీగ్రాములు, వెండి 750 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ముగిసిన ఉగాది సంబరాలు - 8లో



సినీ ప్రముఖులకు సత్కారం - 8లో

న్యూస్‌రీల్

బీపీయూటీ వీసీగా అమియకుమార్



ప్రొఫెసర్ అమియకుమార్ రథ్

భువనేశ్వర్: నగరంలోని బిజూ పట్నాయక్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ(బీపీయూటీ) నూతన వైస్ ఛాన్సలర్(వీసీ)గా ప్రొఫెసర్ అమియకుమార్ రథ్ నియమితులయ్యారు. విశ్వవిద్యాలయాల ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ గణేషీలాల్ ఆమోదం మేరకు ఈ నియామకం జరిగింది. రథ్ ఈ హోదాలో ఐదేళ్ల పాటు కొనసాగుతారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన నుంచి 5 ఏళ్ల పరిమితి లెక్కిస్తారు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు పదవిలో కొనసాగుతారు. ప్రొఫెసర్ అమియకుమార్ బెంగళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్)లో సలహాదారునిగా పని చేస్తున్నారు. అధ్యాపక రంగంలో సుదీర్ఘంగా 33 ఏళ్ల అనుభవం కలిగిన ఆయన.. వివిధ అంశాలపై తొమ్మిది పుస్తకాలను రచించాడు.

గంజాం బార్ ఎన్నికలు నేడు

- ఓటు హక్కు వినియోగించుకోనున్న 1,519మంది న్యాయవాదులు



అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తున్న అక్షయ్ పట్నాయక్

బరంపురం: గంజాం బార్ అసోసియేషన్ 2023-24 ఎన్నికలు శనివారం జరగనున్నట్లు ఎన్నిలక అధికారి అక్షయ్‌కుమార్ పట్నాయక్ వెల్లడించారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఎన్నికలకు సంబంధించి ఆయన ఎన్నికల కమిటీతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బార్ ఎన్నికలో 1,519మంది న్యాయవాదులు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. అధ్యక్ష పదవికి 6 నామినేషన్లు, ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, కార్యదర్శి పదవికి ఆరుగురు, సహాయ కార్యదర్శిగా ముగ్గురు పోటీలో ఉన్నారని ప్రకటించారు. అభ్యర్థుల పేర్లతో బ్యాలెట్ నంబర్లు ముద్రించామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహించి, సాయంత్రం 5గంటల నుంచి లెక్కింపు చేపడతామన్నారు. తుది ఫలితం తేలిన వెంటనే విజేతలను ప్రకటిస్తామని వివరించారు.

జిల్లా కేంద్రంలో పీహెచ్‌సీ ప్రారంభం



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విశాల్‌సింగ్

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో నూతన నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ విశాల్‌సింగ్ శుక్రవారం ప్రారంభించారు. జిల్లా కేంద్రాస్పత్రి మల్కన్‌గిరి కేంద్రానికి 2కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ నేపథ్యంలో అత్యవసర సమయంలో ప్రజలకు సేవలందించేందుకుగాను నూతనంగా పీహెచ్‌సీ ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యాధికారి ప్రఫుల్లకుమార్ నందొ తెలిపారు. వృద్ధుల సౌకర్యార్థం ప్రత్యేకంగా వైద్యుడు అందుబాటులో ఉంటారని ప్రకటించారు.

చైత్రోత్సవాలకు శ్రీకారం



ముహూర్తపు రాట పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: ఉత్తరాంధ్రుల ప్రజల ఇలవేల్పు మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలు ఏప్రిల్ 1నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించి ముహూర్తపు రాట పూజా కార్యక్రమాలను మందిరం ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. అమ్మవారి సేవకులు చంద్రశేఖర్ బెరుకొ ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ముహూర్తపు రాట వేశారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు పెద్దిన వాసు, వద్దాది శ్రీనివాస్ రావు, దేవంద్ర బెహరా తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 31న సాయంత్ర స్థానిక జంఝావతి నది నుంచి శుద్ధ జలాలను తీసుకువచ్చి, అమ్మవారి మందిరంలో నిలుపుతారు. అనంతరం 5రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది అమ్మవారి సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించిందని నిర్వాహకులు తెలిపారు.

రథయాత్రకు లింగరాజు

- ఈనెల 29న రుకుణ, ఏప్రిల్ 2న బహుడా యాత్రలు
- మంత్రి అశోక్‌చంద్ర అధ్యక్షతన ఏర్పాట్లపై సమీక్ష
- బ్రాహ్మణ, పూజా పండా, నియోగ సేవాయత్‌లు గైర్హాజరు



భువనేశ్వర్ లోని లింగరాజ దేవస్థానం



మంత్రి అశోక్‌చంద్ర పండా అధ్యక్షతన సమావేశమైన రుకుణ రథయాత్ర కమిటీ ప్రతినిధులు

భువనేశ్వర్: పవిత్ర అశోకాష్టమి పురస్కరించుకుని ఏటా లింగరాజు రథయాత్ర నిర్వహిస్తారు. ఈ యాత్ర రుకుణ రథయాత్రగా ప్రసిద్ధి. ఈనెల 29న రుకుణ రథయాత్ర జరగనుంది. ఈ నేపథ్యంలో మంత్రి అశోక్‌చంద్ర పండా అధ్యక్షతన సన్నాహక సమావేశం శుక్రవారం జరిగింది. అయితే ఈ కీలక సమావేశానికి బ్రాహ్మణ, పూజాపండా, నియోగ సేవాయత్ వర్గాలు హాజరు కాలేదు. లింగరాజు ప్రభువు రథయాత్రలో వీరి పాత్ర అత్యంత కీలకం. సాంప్రదాయ ఆచార వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత వీరిది. తరచుగా వీరి సహాయం నిరాకరించడం సర్వత్రా అసంతృప్తి కలిగిస్తోంది. ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో మేయర్ సులోచన దాస్, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ప్రఫుల్ల స్వాయి, విద్యుత్ విభాగం అధికారులు హాజరయ్యారు.

ఈ ఏడాది రథ నిర్మాణంలో కలపతో సమస్యలు ఎదురయ్యాయి. కలప ఆలస్యంగా చేరడంతో నిర్మాణంలో జాప్యం చోటు చేసుకుంటుందనే ఆందోళన తలెత్తింది. సకాలంలో రథం సిద్ధం చేసేందుకు సాయశక్తుల కృషి చేస్తున్నట్లు మహరణ సేవాయత్ వర్గం తెలిపింది. యాత్ర సమయానికి రథం అందజేస్తామని నిర్వాహక వర్గానికి హామీ ఇచ్చారు. ఈనెల 29న లింగరాజు రుకుణ రథయాత్ర జరగనుండగా, ఏప్రిల్ 2న మారు రథయాత్ర(బహుడా) చేపట్టనున్నారు.

ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా యాత్ర సక్రమంగా నిర్వహించడంపై సమావేశంలో చర్చించారు. రుకుణ రథయాత్ర పురస్కరించుకుని ఈనెల 29న ఉదయం 5 గంటలకు మంగళ హారతితో నిత్య సేవాదులను సకాలంలో ప్రారంభించి, ఉత్సవ ప్రత్యేక పూజాదులను ముగించడతో మధ్యాహ్నం 1.30 గంటలకు రథంపైకి ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సూర్య అస్తమయానికి ముందుగా రథం గమ్యం చేరేందుకు ఈ సమయ పాలన దోహదపడుతుందని సేవాయత్ వర్గానికి అభ్యర్థించారు.

కోవిడ్ కలవరం!

- 24 గంటల్లో 17 కొత్త కేసులు నమోదు
- భయాందోళన వద్దు: ఆరోగ్యశాఖ డైరెక్టర్



భువనేశ్వర్: రాష్ట్రంలో కోవిడ్-19 సంక్రమణ కలవరపెడుతోంది. గత 24 గంటల్లో కొత్తగా 17 కొత్త క్రియాశీల(యాక్టివ్) కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో కోవిడ్-19 పాజిటివ్ కేసులు సమగ్రంగా 73కి చేరాయి. గత 24 గంటల్లో పలు చోట్ల 5,647 నమూనాలు పరీక్షించారు. అయితే కోవిడ్-19 పాజిటివ్ కేసులు తాజా నమోదు పట్ల ఆందోళన చెందాల్సిందేమీ లేదని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నిరంజన్ మిశ్రా శుక్రవారం ప్రకటించారు. హెచ్3 ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలు తారసపడితే కరోనా పరీక్షలు నిర్వహించడం ప్రారంభించామన్నారు. ఈ నేపథ్యంలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు పుంజుకోవడంతో పాజిటివ్ కేసులు నమోదవుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గత 134 రోజుల్లో ఇవే అత్యధిక కేసులని, అయితే ఈ వ్యవధిలో చికిత్స కోసం ఆస్పత్రిలో చేరడం, మృతుల సంఖ్య పెరగడం వంటి దాఖలాలు లేనట్లు స్పష్టంచేశారు. గురువారం 5,647 నమూనాలు పరీక్షించామని, ఈ విశ్లేషణలో భయపడాల్సిన పరిస్థితులు లేనట్లు తేలిందని ప్రకటించారు. కోవిడ్ కేసులు ఒడిశాలో మాత్రమే కాకుండా దేశమంతటా నమోదవుతున్నాయి. ప్రధానంగా మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో పరిస్థితి మాత్రం అదుపులో ఉందని నిరంజన్ మిశ్రా తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి..

మరోవైపు అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, కోవిడ్-19 రోగులను గుర్తించడంలో పరీక్షలు నిర్వహించడం, వైద్య, చికిత్స సదుపాయాలను అందుబాటులో ఉంచడం తదితర కార్యాచరణ కోసం ఆరోగ్యశాఖ అన్ని జిల్లాలను ఆదేశించింది. ఇన్‌ఫ్లూయెంజా, జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉన్న ప్రతిఒక్కరూ వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించింది. మాస్కులు ధరించి సామాజిక దూరం పాటించడం, చేతులు తరచు కడుక్కోవడం, బహిరంగంగా ఉమ్మడం నివారించి కోవిడ్-19 మార్గదర్శకాలను క్రమం తప్పకుండా పాటించాలని అభ్యర్థించింది. దేశంలోని కోవిడ్-19 పరిస్థితిని సమీక్షించడానికి కేంద్ర ఆరోగ్య కార్యదర్శి ఇటీవల న్యూఢిల్లీలో అన్ని రాష్ట్రాల ఆరోగ్య డైరెక్టర్లతో సమావేశమయ్యారు.

పరారైన ప్రేమజంట ఆత్మహత్య



విగతజీవులుగా పడి ఉన్న ప్రేమజంట

- పెళ్లికి పెద్దలు నిరాకరించడంతో నిర్ణయం

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి తమ్స పంచాయతీ ఎంవీ-7 గ్రామం సమీపంలోని తోటలో ప్రేమజంట మృతదేహాలను గ్రామస్తులు శుక్రవారం గుర్తించారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఎంవీ-7 గ్రామానికి చెందిన నందే మడకామి(18), నవీన్ మడకామి(24) గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఇరువురి వివాహానికి పెద్దలు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో నందేకు మరో సంబంధం చూసిన తల్లిదండ్రులు ఈనెల 22వ వేరొకరితో వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఇరువురూ మంగళవారం రాత్రి ఇంటి నుంచి పారిపోయారు. మరుసటి రోజు ఉదయం చుట్టుపక్కల తల్లిదండ్రులు వెతికినా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం ఉదయం గ్రామం సమీపంలోని తోటలో విగతజీవులుగా పడి ఉండటాన్ని గ్రామస్తులు గమనించారు. దీనిపై మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం అందించగా, మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. సమీపంలో 2 ప్లాస్టిక్ గ్లాసులు కనిపించడంతో విషయం తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్రం తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం



జయపురం ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న దృశ్యం

- జయపురంలో నిరసనకు దిగిన కార్యకర్తలు

జయపురం: 'దొంగలందరికీ మోదీ అని ఇంటి పేరు ఎందుకు ఉంటుందో' వ్యాఖ్యలపై కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత, ఎంపీ రాహుల్‌గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించడంపై ఆపార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ నాయకులు జయపురం ప్రధాన మార్గంలో శుక్రవారం నిరసన వ్యక్తంచేశారు. డీసీసీ అధ్యక్షురాలు మీనాక్షి బాహిణీపతి ఆధ్వర్యంలో జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుకాంత పట్నాయక్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బుల్లు సాహు, కోశాధికారి నిహారవన్ బిశాయి, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు కేంద్రంతీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మకు నిప్పంటించారు. అనంతరం మీనాక్షి బాహిణీపతి మాట్లాడుతూ నీరవ్‌మోదీ, లలిత్‌మోదీ దేశంలోని వివిధ బ్యాంకులను మోసగించి, వేలాది కోట్ల రూపాయల రునాలు ఎగవేయడంతో పాటు విదేశాలకు పారిపోయారని గుర్తుచేశారు. వారంతా దొంగలు కాకుండా మరేవరని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం ఉద్వేశ పూర్వకంగా కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీల నేతలపైన రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను తమ స్వార్థ ప్రయోజనాలకు వినియోగించు కుంటున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని ఉధృత్యం చేస్తుందని వివరించారు.

అవగాహనతోనే నియంత్రణ

- గంజాం సీడీఎంతో జగదీశ్వర్ పట్నాయక్
- టీబీ నియంత్రణపై జిల్లాల్లో చైతన్య శిబిరాలు



పర్లాకిమిడి: సూచనలందిస్తున్న సీడీఎంఓ డాక్టర్ పీకే పాత్రొ



మాట్లాడుతున్న సీడీఎంఓ జగదీష్ పట్నాయక్

బరంపురం: ప్రజల్లో టీబీ వ్యాధిపై మరింత చైతన్యం అవసరమని, ముందస్తు అవగాహనతోనే వ్యాధిని నియంత్రించవచ్చని జిల్లా ముఖ్య ఆరోగ్యశాఖ అధికారి జగదీశ్వర్ పట్నాయక్ సూచించారు. నగరంలోని సిటీ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న ఐఎంఏ హాలులో జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ టీబీ నివారణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి 3నిమిషాలకు ఒకరు టీబీతో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యాధిపై అవగాహనతో పాటు ప్రతి ఒక్కరినీ చైతన్యవంతం చేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆరోగ్యశాఖ సహాయ అధికారి ఉమ కాంత్ మిశ్రా మాట్లాడుతూ గతంలో క్షయ వ్యాధికి మందులు ఉండేవి కావని, ప్రస్తుతం ప్రభుత్వం వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందిస్తోందని తెలిపారు. బాధితులు ఆందోళనకు గురికాకుండా వైద్యుల సూచనతో క్రమం తప్పకుండా మందులు వినియోగిస్తే వ్యాధిని తరిమికొట్ట వచ్చని వివరించారు. అంతకుముందు స్థానిక సీడీఎం కార్యాలయం నుంచి సిటీ ఆస్పత్రి వైద్యులు, ఎంకేసీజీ కళాశాల సిబ్బంది నగరంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నగరంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై చైతన్య ర్యాలీ చేపట్టారు. స్థానిక సిద్ధార్థ క్లీనిక్‌లో డాక్టర్ జమ్ముల నారాయణ రావు ఆధ్వర్యంలో అవగాహన శిబిరం నిర్వహించారు.

వైద్యుల సూచనలు..

రాయగడ: ప్రపంచ క్షయ రోగ నివారణ దినోత్సవాన్ని జిల్లా ఆరోగ్యశాఖ పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే జిల్లా ముఖ్యవైద్యాధికారి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రచార రథాన్ని ప్రారంభించారు. పట్టణంలోని అన్నివీధుల్లో ఈ రథం తిరుగుతూ క్షయరోగ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలు తప్పనిసరి..

పర్లాకిమిడి: సకాలంలో మందులు తీసుకుంటే క్షయ వ్యాధిని నివారించవచ్చని జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రొ సూచించారు. పర్లాకిమిడి లోని జిల్లా కేంద్రాస్పత్రి నుంచి పట్టణంలోని పలు కూడళ్లలో బినోదిని సైన్స్ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీడీఎంఓ కార్యాలయంలో టీబీ నిపుణులు డాక్టర్ రఘునారాయణ దాస్ మాట్లాడుతూ జిల్లాలో వ్యాధి తీవ్రతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రోగులు డాట్ కోర్సు మందులు వాడుతున్నా.. ప్రతి 2 నెలలకు ఒకసారి తనిఖీ చేయించుకోవాలన్నారు. అలాగే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని డీపీహెచ్ఓ డాక్టర్ ఎంఎం అలీ తెలిపారు. జిల్లాకేంద్రంలో టీబీ రెసిస్టన్స్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు జిల్లా టీబీహెచ్ సమన్వయకర్త కె.అమర్‌నాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఎం సౌమ్యారాణి గౌడో, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఇందిరా మహాపాత్రొ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రాయగడ: చైతన్య రథంతో ఆరోగ్య సిబ్బంది

క్లుప్తంగా

మిషన్ మిల్లెట్‌పై చైతన్య ర్యాలీ



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

జయపురం: మిషన్ మిల్లెట్ కార్యక్రమంలో భాగంగా జయపురం ప్రకాశ విద్యాలయం ఎన్‌సీసీ క్యాడెట్లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విద్యాలయం వద్ద ప్రిన్సిపాల్ కృష్ణ నిశంకో, వైస్ ప్రిన్సిపాల్ పి.సుకుమార్ పతాకాన్ని ఊపి ర్యాలీని ప్రారంభించగా.. బైపాస్ రోడ్డు, మహాత్మాగాంధీ కూడలి, 26వ జాతీయ రహదారి మీదుగా విక్రమదేవ్ స్వయంపాలిత కళాశాలకు వెళ్లారు. అక్కడ ఎన్‌సీసీ కమాండెంట్ డాక్టర్ లక్ష్మణపాత్రో మిషన్ మిల్లెట్ కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆహారంలో మిల్లెట్లు(చిరుధాన్యాలు) వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తిరుగు మార్గంలో లక్ష్మీపండా కూడలి, జయనగర్, పంచానన మందిరం, తరణి చక్, పవర్‌హౌస్ కాలనీ మీదుగా విద్యాలయానికి చేరుకున్నారు.

కూష్మాండ స్వరూపంలో జగులైమాత



కూష్మాండ అలంకారంలో కుదియారి గ్రామదేవత జగులైమాత

భువనేశ్వర్: ఖుర్దారోడ్ కుదియారి గ్రామదేవత వసంత నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారు కూష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సంధ్యవేళలో మహా స్నానం అనంతరం చిత్రకార్ సేవకుడు బిజయ్‌కుమార్ పండా అమ్మవారికి ఈ అలంకరణ చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చండీ పారాయణం, షోడశోపచార పూజలు నిర్వహించారు.

మూడు క్వింటాళ్ల గంజాయి స్వాధీనం



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధి ముదిలిపాడ గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు 3 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముదిలిపాడ గ్రామంలో వేణు హంతాల్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా గంజాయి నిల్వ చేసినట్లు సమాచారం అందింది. ఈ మేరకు మల్కన్‌గిరి ఎక్సైజ్ పోలీసులు దాడిచేయగా, 364 కిలోల సరుకు పట్టుబడింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. అలాగే బలిమెల రహదారిలో బైక్‌పై తరలిస్తున్న 64 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, నిత్య్ పర్మానిక్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి. శనివారం ఉదయం కోర్టులో హాజరు పరుస్తామని ఎక్సైజ్ ఎస్‌ఐ ఉదయ్‌లాల్ నాయిక్ తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఆశిష్‌కుమార్ నాయక్, దీపక్ సమాల్, చిత్రకొండ ఎక్సైజ్ ఎస్‌ఐ కుమార్ జెనా, రామచంద్ర హంతాల్, ప్రమోద్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

పలాస రైల్వేస్టేషన్‌లో వృద్ధుడి మృతి



రైలు పట్టాలపై వెంకటస్వామి మృతదేహం

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్-2లో వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. జీఆర్‌పీ పోలీసులు విచారణ జరపగా సోంపేట మండలం పాత్రకండ గ్రామానికి చెందిన గోకర్ల వెంకటస్వామి(70)గా గుర్తించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

పక్కుడుభద్రలో ఏనుగులు

భామిని: మండలంలోని పక్కుడుభద్రలో ఆరు ఏనుగుల గుంపు సంచరిస్తోంది. కాట్రగడ-బి వద్ద ఏబీ రోడ్డు పక్కన ఉన్న మొక్కజొన్న పంటను నాశనం చేశాయి. అనంతరం పక్కుడుభద్ర వద్ద జీడితోటల్లోకి చేరాయి. అటువైపుగా ఉపాధిహామీ పనుల కోసం వెళ్లిన వేతనదారులు ఏనుగులను చూసి పరుగుతీశారు.

ముగిసిన ఉగాది సంబరాలు

- ఉర్రూతలూగించిన టాలీవుడ్ గాయకుల గీతాలాపన
- ఉత్సవాల్లో పాల్గొన్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక
- నెక్కంటికి అభిమానుల ఘన సన్మానం

రాయగడ:

పట్టణంలోని హోటల్ తేజస్వి మైదానంలో రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న ఉగాది సంబరాలు గురువారం రాత్రి ముగిసాయి. ఇందులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఉత్సవాల్లో పాల్గొన్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉలక తెలుగులో కొద్దిసేపు మాట్లాడారు. అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు, ఒడియా ప్రజలు సమైఖ్యతగా పండగలను జరుపుకొని, ఒకరికొకరు ఆహ్వానించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అదే సంప్రదాయం కొనసాగేలా ఈ ఏడాది సంబరాలు నిర్వహించారని అభినందించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతీ పండగను సంయుక్తంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

నెక్కంటికి సత్కారం..

తెలుగు భాషా, సంస్కృతి పరిరక్షణ కోసం కృషి చేస్తూ అందరినీ కలుపుకునే విధంగా ఏటా ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నడుం బిగిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు దంపతులను ఉత్సవ వేదికపై అభిమానులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఇంతగా అభిమానించడం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. గత పదేళ్లుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది మరింత విజయవంతం కావడానికి అందరి ఆదరాభిమానాలు, సహాయ, సహకారాలే కారణమని వివరించారు. ఇకపై కూడా ఈ తరహా సంప్రదాయాలను కొనసాగేలా తనవంతు కృషి చేస్తానని ప్రకటించారు.



నెక్కంటిని సన్మానిస్తున్న అభిమానులు



కార్యక్రమానికి హాజరైన తెలుగు, ఒడియా ప్రజలు

ఉర్రూతలూగించిన గాయకులు..

ఉగాది ముగింపు కార్యక్రమంలో టాలీవుడ్ నేపథ్య గాయకులు ఎస్పీ చరణ్, కల్పన, అదితి భవరాజు, ఇండియన్ ఐడిల్ సింగర్ జయంత్ పాల్గొన్నారు. ముందుగా ఎస్పీ చరణ్ వినాయక ప్రార్థన గీతంతో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారభించారు. అనంతరం ప్రజల కోరిక మేరకు పలు పాటలను పాడి వినిపించారు. పాటల రాక్షసిగా గుర్తింపు పొందిన సింగర్ కల్పన ప్రేక్షకులను ఉర్రూతలూగించే విధంగా గీతాలను ఆలపించారు. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు ఇమిటేషన్ రాజు పలువురి కథానాయకుల గళంతో నిర్వహించిన మిమిక్రీ రంజింపజేసింది. అదితి భవరాజు, జయంత్ కొత్త సినీ పాటలు పాడి వినిపించారు. ప్రముఖ యాంకర్ శ్యామల వ్యాఖ్యాతగా నిలిచారు.

విజేతలకు బహుమతుల ప్రదానం..

ఉగాది సందర్భంగా పట్టణంలోని పలువురు ప్రముఖులను ఉగాది ఉత్సవ కమిటీ ఘనంగా సన్మానించింది. స్థానిక వేద పండితులు రేజేటి శ్రీనివాస్‌శర్మ దంపతులను శాలువా కప్పి సన్మానించారు. పట్టణ ప్రముఖులు చంద్రమౌళి కుముందాన్ దంపతులు, రాఘవ కుముందాన్, సిల్లా జగన్నాథ స్వామి తదితరులు రేజేటికి బంగారు కంకణంతో ఘనంగా సత్కరించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రంగవల్లులు, మెహందీ, వన్ మినిట్ షో, ఉగాది క్వీన్, డ్యాన్స్ బేబి డ్యాన్స్ తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి వేదికపై బహుమతులను అందజేశారు. ఉత్సవాలను వేలాది మంది తరలివచ్చి, వీక్షించారు.



ఇమిటేషన్ రాజు షో



గీతాలాపనలో సింగర్ కల్పన

రెండు వేదికలపై..

ఈ ఏడాది రాయగడలో 2 వేదికలపై ఉగాది ఉత్సవాలు జరగడం కొసమెరుపు. నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో స్థానిక తేజస్వి మైదానంలో ఒక వేదిక రూపుదిద్దుకుంటే, జేకే రోడ్డు హీరో షోరూం సమీపంలోని మైదానంలో ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో మరో వేదిక ఏర్పాటైంది. దీనికి ఎల్ల వేంకటేశ్వరరావు(కొండబాబు) నేతృత్వం వహించారు. ముందుగా అనుకున్నట్లుగానే 2 ఉగాది వేడుకలు నిర్వహించడం నువ్వానేనా అన్నట్లు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో 2 వేదికలకు కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



రేజేటి శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం



ఎస్పీ చరణ్, అదితి, జయంత్ ఆలపిస్తున్న దృశ్యం

సినీ ప్రముఖులకు సత్కారం

- పర్లాకిమిడిలో సందడిగా ఉగాది ఉత్సావాలు
- హాజరైన టాలీవుడ్ సీనియర్ నటులు సుమన్, బాబుమోహన్

పర్లాకిమిడి: టాలీవుడ్ సీనియర్ నటులు సుమన్, బాబూమోహన్ రాకతో పర్లాకిమిడి ఉగాది ఉత్సవ ప్రాంగణం సందడిగా మారింది. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జనం భారీగా తరలిరావడంతో హైటెక్ ప్లాజా మైదానం కిక్కిరిసింది. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల్లో తిరుపతి పాణిగ్రాహి పోటీ చేసిన సమయంలో ప్రచారం నిమిత్తం పర్లాకిమిడి వచ్చానని గుర్తు చేసుకున్నారు. ఉగాది పర్వదినం నేపథ్యంలో తన జీవిత భాగస్వామి వారించినా.. పాణిగ్రాహితో ఉన్న అనుబంధం తోనే వచ్చానని తెలిపారు. హాస్యనటులు బాబూమోహన్ తాను నటించిన చిత్రాల్లోని పలు డైలాగులను వినిపించి, ప్రేక్షకులను ఆనందింపజేశారు. దివంగత నటి సౌందర్యతో కలిసి డ్యాన్స్ చేసిన 'చినుకు చినుకు' పాట పాడి, అలరించారు. అనంతరం ఇరువురు సీనియర్ నటులను జ్ఞాపికలు, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. అలాగే జబర్దస్త్ నటులు శాంతి స్వరూప్, మోహన్ కామెడీ స్కిట్లతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో బుల్లెట్ భాస్కర్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, హైటెక్ గ్రూప్స్ ఎండీ రూపేష్ పాణిగ్రాహి సభను విజయవంతం చేయడానికి కృషిచేశారు.



బాబూమోహన్‌ను సన్మానిస్తున్న రూపేష్ పాణిగ్రాహి, కాశీనగర్ చైర్‌పర్సన్ సుధారాణి



మాట్లాడుతున్న సినీ నటులు సుమన్



జబర్దస్త్ బృందం శాంతి స్వరూప్, మోహన్ డ్యాన్సులు

కరోనా అభాగ్యులకు 'ఆశీర్వాద్' సాయం

- ప్రతి నెలా రూ.2,500లు అందిస్తున్న రాష్ట్రప్రభుత్వం
- అసెంబ్లీలో సమాధానమిచ్చిన మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి బాసంతి హెంబ్రామ్



భువనేశ్వర్: కరోనా మహమ్మారి తాకిడితో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల బాగోగులను ప్రభుత్వం పర్యవేక్షిస్తోంది. వైరస్ ప్రభావంతో పలువురు బాలలు తల్లిదండ్రులను, మరికొందరు ఇరువురిలో ఎవరో ఒకరిని పోగుట్టుకున్నారు. అటువంటి వారందరికీ 18ఏళ్లు నిండేంత వరకు ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించింది. పలువురు బాలలకు శిశు సంరక్షణ హాస్టల్‌లో ఆశ్రయం కల్పించారు. మరి కొందరిని ఆత్మీయులు, బంధువర్గాలు సంరక్షిస్తున్నారు. ఈ రెండు వర్గాల బాలలకు ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. దీనికోసం ఆశీర్వాద్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా కోవిడ్-19తో 50,952మంది పిల్లలు తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరినీ కోల్పోయినట్లు రాష్ట్రప్రభుత్వం గుర్తించింది. వీరందరినీ ఆశీర్వాద్ పథకం కింద జోడించామని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి బాసంతి హెంబ్రామ్ వెల్లడించారు. శాసనసభలో కొనసాగుతున్న బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకుని శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల్లో మంత్రి ఈ వివరాలను లిఖిత పూర్వకంగా ప్రవేశ పెట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి అడిగిన ప్రశ్నకు పై విధంగా సమాధానమిచ్చారు.

కేంద్రం నుంచి 108మందికి..

తల్లిదండ్రులు కోల్పోయిన ప్రతి బిడ్డకు ప్రభుత్వం నెలకు రూ.2,500లు చొప్పున ఆర్థిక సాయం అందజేస్తోంది. కుటుంబ పోషకులు కరోనా బారినపడి అకాల మరణానికి గురైన పరిస్థితుల్లో బాలలకు నెలకు రూ.1,500 చొప్పున పంపిణీ చేస్తున్నారు. శిశు సంరక్షణా సంస్థలో ఆశ్రయం పొందిన ఈ కోవకు చెందిన ప్రతి చిన్నారికి రూ.వెయ్యి మంజూరు చేస్తున్నారు. బిడ్డకు 18 ఏళ్లు నిండే వరకు ఈ సహాయం కొనసాగుతోందని మంత్రి లిఖిత పూర్వక జవాబులో పేర్కొన్నారు. 2020 ఏప్రిల్ 1నుంచి కోవిడ్-19 విపత్తు తొలగేంత వరకు తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ఆశీర్వాద్ పథకం కింద లబ్ధిదారులుగా పరిగణిస్తారు. కోవిడ్-19 మహమ్మారి కారణంగా తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన రాష్ట్రానికి చెందిన 108 మంది బాలలకు ప్రధాన మంత్రి కేర్స్ పథకం కింద సాయం అందుతోంది.

పట్టుబడిన దోపిడీ దొంగలు

- మరో ఏడుగురు నిందితుల పరార్
- సినీ ఫక్కీలో పెట్రోల్ బంక్ మేనేజర్‌ను దోచుకున్న దుండగులు

జయపురం: దారి కాచి, సినీ ఫక్కీలో వ్యక్తిని దోచుకున్న దొంగల ముఠాలో ఇద్దరు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. ముఠాలో మరో ఏడుగురు పరారీలో ఉన్నారని సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. నిందితులు జయపురం సమితి ఉమ్మిరి గ్రామానికి చెందిన జిత్తు దాస్(21), మొకాపుట్ గ్రామవాసి అమన్ నాగ్(21)గా తెలిపారు. అలాగే ఉమ్మిరి గ్రామానికి చెందిన డేవిడ్, మొకాపుట్‌కు చెందిన సంజయనాగ్, పల్లిగుడ గ్రామవాసి గోపి, కలిమగుడకు చెందిన బాబుల్, తెలియ గ్రామవాసి వికాశ్, భత్ర గ్రామానికి చెందిన రితిక్ పరారీలు ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు ప్రకటించారు. వివరాల్లోకి వెళ్తే... కుంద్రా లోని భగవతి పెట్రోల్ బంక్ మేనేజర్ అరవింద మండల్(35)ను దోచుకోవడానికి ముఠా సభ్యులు పథకం వేశారు. ఈనెల 22న రాత్రి 8గంటల సమయంలో ఆయన కదలికలపై నిఘా పెట్టారు. రాత్రి 10గంటల సమయంలో మేనేజర్ కుంద్రా నుంచి తన స్వగ్రామం పంపుణీకి బైక్‌పై బయలుదేరారు. ద్విచక్ర వాహనాలపై ఆయనను వెంబడించిన దుండగులు పెడియకోల కూడలి వద్ద వాహనాన్ని అడ్డుకున్నారు. వెదురు దుంగతో అతని తలపై దాడిచేశారు. అయితే తలకు హెల్మెట్ ఉండటంతో మేనేజర్ చాకచక్యంగా తప్పించుకోగా.. తన గ్రామం సమీపంలోని హనుమాన్ మందిరంలోకి దూరి తల దాచుకొన్నారు. వెంటనే తన మిత్రులకు ఫోన్ చేసి, పరిస్థితిని తెలియజేశారు. వెంటనే అతని మిత్రులు, గ్రామస్తులు అక్కడికి చేరుకునే సరికి దుండగులు మందిరంలోకి ప్రవేశించి, మేనేజర్ వద్ద ఉన్న రూ.20,300లు దోచుకుపోయారు.



అమన్ నాగ్



జిత్తు దాస్

మొత్తం 9మంది..

గ్రామస్తులను గమనించిన దుండగులు అక్కడి నుంచి సమీపంలోని అడవిలోకి పారిపోయారు. వారిని వెంబడించగా, ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. అదేరోజు రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న జయపురం సదర్ పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ జీపీ బెహరాకు సమాచారం అందించగా, సిబ్బందితో సహా గ్రామానికి చేరుకున్నారు. పట్టుబడిన ఇద్దరు దుండగులను అదుపులోకి తీసుకోవడంతో పాటు మేనేజర్ నుంచి దోచుకున్న నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని విచారించగా, దోపిడీలో మొత్తం 9మంది పాల్గొన్నట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. పరారైన వారి కోసం గాలిస్తున్నట్లు వివరించారు.

జంతువుల పట్ల క్రూరత్వం తగదు

- సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్

పాలకొండ రూరల్: జంతువుల పట్ల క్రూరత్వం ప్రదర్శించడం తగదని, వన్యప్రాణులను వేటాడితే చట్ట ప్రకారం శిక్షతప్పదని సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్ హెచ్చరించారు. తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. సబ్ డివిజన్‌లో జంతు క్రూరత్వ నివారణ చట్టం సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసేలా ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసిందన్నారు. 1960 చట్టం మేరకు జంతువులను అక్రమంగా రవాణా చేయడం నేరమని పేర్కొన్నారు. జంతువుల జనన వివరాలు నమోదుచేయాలన్నారు. ప్రతి ఒక్కరూ వాటిపట్ల స్నేహభావనతో మెలగాలని, ఎటువంటి హాని తలపెట్టవద్దన్నారు. సమావేశంలో డీఎస్పీ జి.వి.కృష్ణారావు, పశుసంవర్ధకశాఖ ఏడీ ప్రభామాణిక్యాలరావు, వెటర్నరీ సహాయ సర్జన్ బి.సిద్ధార్థ, కమిటీ సభ్యుడు, నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, సీఐ కె.మురళీధర్, డీఎల్‌పీఓ జె.రాంప్రసాద్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.లావణ్య, సహాయ కార్మికశాఖ అధికారి కె.కిరణ్‌చంద్ర, దేవదాయశాఖ అధికారి ఎస్.రామారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

పిల్లలు, గర్భిణులకు 'సంపూర్ణ పోషణ'

పార్వతీపురం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే వడ్డించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య తగ్గించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు కీలకభూమిక పోషించాలన్నారు. సీతంపేట, కురుపాం, భద్రగిరి, పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో పిల్లలు, గర్భిణుల హాజరు తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారించాలని సూచించారు. పునరుత్పత్తి, చిన్నారుల ఆరోగ్య గుర్తింపుకార్డు (ఆర్‌సీహెచ్ ఐడీ) మ్యాపింగ్ ప్రక్రియను ఈ నెల 25 నాటికి పూర్తిచేయాలన్నారు. ఆరేళ్లలోపు వయస్సు గల పిల్లల ఆధార్‌కార్డులను శనివారం నాటికి అప్‌డేట్ చేయాలని సూచించారు. వీడియో కాన్ఫిరెన్స్‌లో ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి పాల్గొన్నారు.

పట్టపగలే దోచేశారు

- పది తులాల బంగారం, అరకేజీ వెండి, రూ.20 వేల నగదు చోరీ
- బావరాజుపాలెంలో ఘటన

రణస్థలం: పట్టపగలే ఓ ఇంట్లో దొంగలుపడ్డారు. బంగారు వెండి ఆభరణాలు, నగదుతో ఉడాయించారు. రణస్థలంలోని జె.ఆర్.పురం సమీపంలో బావరాజుపాలెంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుగ్గు గోవింద అనే వ్యాపారి జె.ఆర్.పురంలో బ్యాంగిల్ షాపు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం 9 గంటలకు షాపు తెరిచేందుకు వెళ్లిపోయారు. ఇంటి పనులన్నీ పూర్తయ్యాక అతని భార్య శ్యామల కూడా 11 గంటల సమయంలో షాపు వద్ద వెళ్లారు. అప్పటికే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి సమీపంలోని కొబ్బరి తోటలో మాటువేశారు. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక వారిలో ఇద్దరు ఇంటి గడియను కటర్‌తో పగలుకొట్టి లోపలికి ప్రవేశించారు. ఓ వ్యక్తి బయటే బైక్‌తో సిద్ధంగా ఉన్నాడు. ఆ సమయంలో పొరుగింటి మహిళ కామన్‌గా ఉన్న తాగునీటి బోరు మోటార్ వేసేందుకు గోవింద ఇంటికి వచ్చింది. ఈ అలజడితో ఇంటి నుంచి ఇద్దరు వ్యక్తులు నిదానంగా బయటకు నడుచుకుని వచ్చి బైక్‌పై సిద్ధంగా ఉన్న వ్యక్తితో కలిసి క్షణాల్లో పరారయ్యారు. ఇంటి తలుపు గడియలు విరిగి ఉండటాన్ని గమనించిన మహిళ వెంటనే గోవిందకు సమాచారం అందించింది. వారు వచ్చి చూసేసరికి బీరువాలో 10 తులాల బంగారం, అర కేజీ వెండి, రూ.20 వేలు నగదు కనిపించలేదు. వెంటనే జె.ఆర్.పురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ మత్తే మహేంద్ర, సీఐ ఎస్.ఆదాం, క్లూస్ టీం సిబ్బంది పరిశీలించి వివరాలు సేకరించారు. ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దొంగతనం జరిగిన ఇంటి వద్ద క్లూస్ టీం సిబ్బంది, స్థానికులు



బీరువా వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

రాములోరి కల్యాణానికి తీపి సారె

శ్రీరామనవమిని పురస్కరించుకుని రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఈ నెల 30న జరగనున్న సీతారాముల కల్యాణోత్సవంలో తీపి పదార్థాలతో తయారు చేసిన కంత (సారె) ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన మునకాల గోవిందరావు అనే భక్తుడు ఏటా వివిధ ఆకృతుల్లో సిద్ధంచేస్తున్న కంతను స్వామికి సమర్పిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా తీపితో తయారుచేసిన చీర, అరటిపండ్లు, కొబ్బరికాయ తదితర వాటిని సిద్ధం చేశారు. రామతీర్థం సేవా సంఘం సభ్యుల ద్వారా ఆ రోజు స్వామివారికి సమర్పించనున్నారు.

– నెల్లిమర్ల రూరల్



తీపితో తయారు చేసిన చీర

క్లుప్తంగా

'వాహన చట్టాలు అమలు చేయాల్సిందే'



మట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలీస్, బీమా కంపెనీల అధికారులు మోటార్ వెహికల్ చట్టం అమెండ్‌మెంట్–2022ను పరిధిలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన శుక్రవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో ఈ అమెండ్‌మెంట్‌పై పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్స్‌కు, పలు బీమా కంపెనీల అధికారులకు, న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ కొత్త చట్టాలను అనుసరించి ఎవరి బాధ్యత వాళ్లు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. వాహన ప్రమాదాల్లో కక్షిదారులకు సత్వరం న్యాయం అందించాలన్నారు.

శ్రీముఖలింగం ఆలయ హుండీ ఆదాయం రూ.4.37 లక్షలు



ఆలయ ఆదాయం లెక్కిస్తోన్న ఈఓ అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం శివరాత్రి అనంతరం హుండీ ఆదాయం రూ. 4,37,519 వచ్చినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. ఆలయ అర్చకులు, కొమనాపల్లి సత్యసాయి సేవా సంఘం సభ్యుల సమక్షంలో ఆదాయం లెక్కించినట్లు ఈఓ తెలిపారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.10.11 లక్షలు

పాతపట్నం: పాతపట్నంలో కొలువైన నీలమణిదుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ. 10,11,709 వచ్చిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు చెప్పారు. శ్రీకాకుళం దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ జీవీబీఎస్ రవికుమార్ పర్యవేక్షణలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపు జరిగిందన్నారు. 84 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. అలాగే మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న శ్రీ వెంకటేశ్వర ఆలయంలో 360 రోజులకు భక్తుల కానుకల ద్వారా వచ్చిన హుండీ ఆదాయం రూ. 1,11,856లు వచ్చిందని ఈఓ తెలిపారు.

'అనుబంధ కాలేజీలకు నాక్ గుర్తింపు తప్పనిసరి'



కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్య సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ రామ్మోహన్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాలలకు నాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గుర్తింపు తప్పనిసరని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్ రావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని అనుబంధ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు, అనుబంధ కళాశాలలకు నాక్ గుర్తింపు అంశంపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏడాది లోపు రాష్ట్రంలో అన్ని కళాశాలలు నాక్ గుర్తింపు సాధించాలని సూచించిందని అన్నారు. నాక్ గుర్తింపు లేకుంటే కళాశాలకు భవిష్యత్ ఉండదని స్పష్టం చేశారు. నాక్ సైతం గుర్తింపు మంజూరుకు రూ. 3.50 లక్షలు దరఖాస్తుకు వసూలు చేస్తుందని, అన్ని ప్రమాణాలు ఉంటేనే గుర్తింపు ఇస్తుందని అన్నారు. ఏ, బీ ప్లస్ వంటి గ్రేడులు సాధించాలంటే తప్పకుండా మౌలిక, బోధన వసతులు ఉండాలన్నారు. భవిష్యత్‌లో విద్యలో సైతం ఇంటర్న్‌షిప్ తప్పనిసరిగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్ .ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

మేకల మందపై కుక్కల దాడి

- ఎనిమిది పిల్లల మృతి

పాలకొండ: పట్టణంలోని ఏలాం ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున కుక్కల గుంపు దాడి చేయడంతో ఎనిమిది మేకపిల్లలు మృతిచెందాయి. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేకల పెంపకం దారు జోలయ్య గురువారం రాత్రి తల్లి మేకలను ఒక చోట ఉంచి పిల్లలను వేరే పాకలో ఉంచారు. అర్ధరాత్రి దాటిన తరువాత కుక్కల గుంపు పిల్లలు ఉన్న పాకలోనికి చొరబడి వాటిని వెంటాడి ముక్కలు ముక్కలుగా చేశాయి. ఇంతలో వాటి అరుపులు విని వెళ్లిన జోలయ్య కుక్కల గుంపును తరిమేందుకు ప్రయత్నించగా ఆయనపై కూడా దాడిచేశాయి. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి కుక్కలను తరిమారు. అప్పటికే ఎనిమిది మేక పిల్లలు మృతిచెందగా మరి కొన్ని గాయాలపాలయ్యాయి. వాటికి స్థానిక పశువైద్య కేంద్రంలో చికిత్స చేశారు.

సైబర్ సవాల్

- పెరిగిపోతున్న సైబర్ మోసాలు
- యువతే టార్గెట్
- ఎస్పీ చొరవతో కేసులు పరిష్కరిస్తున్న సైబర్ పోలీసులు
- 1930కు ఫిర్యాదు చేయాలని సూచన

శ్రీకాకుళంక్రైమ్: పెళ్లి పేరుతో డబ్బులు పోగొట్టుకున్నది ఒకరు. జాబ్ వస్తుందనే ఆశతో సొమ్ములు ఇచ్చేసింది మరొకరు. లాటరీ ఆనందంలో ఖాతా ఖాళీ చేసుకుంది ఇంకొకరు.. నేరమేదైనా వేదిక మాత్రం ఆన్‌లైనే. సాంకేతికత పెరుగుతూ పనులు సులభమవుతున్న కాలంలో.. అదే సాంకేతికతను అడ్డం పెట్టుకుని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. ఈ సైబర్ నేరాలు పోలీసులకు కూడా సవాల్ విసురుతున్నాయి. ఎప్పటికప్పుడు కేసులు పరిష్కరిస్తున్నా.. ఇంకా కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. జనం ఈ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుంటేనే మోసాలు తగ్గుతాయని పోలీసులు సూచిస్తున్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 154 కేసులు నమోదయ్యాయి. ఆన్‌లైన్ లోన్‌యాప్స్, ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సర్వీస్), కస్టమర్ కేర్ ఫ్రాడ్ కేసులకు సంబంధించి రోజుకో ఫిర్యాదు అందుతోందని సైబర్ పోలీసులు చెబుతున్నారు.



లాటరీల మాయ..

మీకు లాటరీ రూ. 2 లక్షలు తగిలిందని మీ మొబైల్‌కు కాల్ లేదా మెసేజ్ వస్తుంది. మీరు రిజిస్ట్రేషన్, ప్రాసెస్ ఫీజు కడితే చాలంటారు. కొరియర్‌లో విలువైన గిఫ్ట్ పంపాం, మధ్యలో ఆగింది, మీరు అమౌంట్ పంపితే వస్తుందంటారు. ఇలాంటి కేసులు నిత్యం వస్తుంటాయి. ఆన్‌లైన్‌లో మీకు రూ. 30 వేల లోన్ వస్తుందంటారు. లింక్ క్లిక్ చేయమంటారు. ఇలాంటివి నమ్మకూడదు. డాక్యుమెంట్ వెరిఫికేషన్ లేకుండా వ్యక్తిగత లోన్‌లు ఎవరూ ఇవ్వరు. విలువైన గిఫ్ట్‌లూ పంపరు. అది ప్రజలు గమనించాలి.

ఉద్యోగం పేరుతో..



వర్క్ ఫ్రం హోమ్ ఆన్‌లైన్ జాబ్ ఇస్తామంటూ యాడ్ లేదా క్లాసిఫైడ్ ఆన్‌లైన్‌లో వస్తుంది. ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజు యూపీఐ ట్రాంజెక్షన్ ద్వారా కట్టమంటారు. లేదంటే వారే ఓ లింక్ పంపించి క్లిక్ చేసి డబ్బులు వేయమంటారు. అక్కడితో ఆగరు. ల్యాప్‌టాప్, సర్టిఫికేట్స్ వెరిఫికేషన్, అపాయింట్‌మెంట్ లెటర్ ఖర్చులంటూ దఫదఫాలుగా గుంజేస్తారు. ఇలాంటి ప్రకటనలు చూసినప్పుడు నిజనిర్ధారణ చేసుకోవాలి. అప్పటికప్పుడే ఎవరూ డబ్బులు వేయమని అడగరు. ఇది గుర్తుంచుకోవాలి.

ఓటీపీలు పంపించి..



మీకు ఓటీపీ వచ్చింది. చెప్తే మీకు అమౌంట్ వేస్తాం.. లేదంటే మీకొచ్చిన గిఫ్ట్ యాక్టివేట్ అవుతుంది అంటూ ఆశ పెడతారు. యాక్టివేట్ అవ్వాలంటే మీ ఓటీపీ ఓ సారి చెప్పండంటూ ఫోన్‌లు చేస్తారు. ఓటీపీ ఎవరికీ చెప్పకూడదని బ్యాంకులన్నీ ఎప్పటి నుంచో జాగ్రత్తలు చెబుతున్నాయి. ఆ జాగ్రత్త పాటిస్తే మేలు.



కస్టమర్ కేర్ నుంచి..

ఇప్పుడు మొబైల్ నిండా ఆన్‌లైన్ షాపింగ్ యాప్‌లే. మోసగాళ్లు వాటిని కూడా వాడుకుంటున్నారు. ఫలానా యాప్ నుంచి మాట్లాడుతున్నామంటూ మోసం చేస్తారు. అలాగే వీటికి సంబంధించి నకిలీ కస్టమర్ కేర్ నంబర్లూ ఉంటాయి. గూగుల్‌లో వెతికి వాటికి కాల్ చేస్తే ఖాతాకు మంగళం పాడేస్తారు.

పెళ్లి సంబంధాల మోజులో..



మ్యాట్రిమోనీ సైట్‌ల పేరుతో మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పెళ్లి కాని వ్యక్తుల వివరాలు తీసుకుని అమ్మాయి పేరుతో దగ్గరవుతారు. ఏవో అవసరాలు చెప్పి డబ్బులు గుంజేస్తారు. అదును చూసి మాయమైపోతారు. వ్యక్తి ఎవరో తెలియకుండా డబ్బులు వేస్తే మోసపోవడం ఖాయం.

ఇంకా కొన్ని..

- యూపీఐ నగదు బదిలీల పేరుతో కొందరు మన ఎం–పిన్, పాస్‌వర్డ్, క్యూఆర్ కోడ్ డీటైల్స్ తీసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఆ వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వకూడదు.
- అలాగే బయోమెట్రిక్ వేలిముద్రలు వేసినప్పుడు కూడా జాగ్రత్తగా ఉండాలి. ఈ డేటా లీక్ కాకుండా చూసుకోవాలి.
- ఏటీఎం సెంటర్లలో పిన్ కొట్టేటప్పుడు, లావాదేవీ ఆగిపోయినప్పుడు కార్డ్ తీసుకునేటప్పుడు నిశితంగా గమనించాలి. లేదంటే మన కార్డు క్లోనింగ్ చేసి మోసం చేసే అవకాశం ఉంటుంది.
- అన్నింటి కంటే పెద్ద మోసం ఆన్‌లైన్ లోన్స్. ఖాళీగా ఉన్న యువత, నిరుద్యోగులు, డబ్బులు అవసరమైన వారికి ఎర వేసి వారికి అప్పులు ఇచ్చి ఆస్తులు లాగేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ లోన్స్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. మన గ్యాలరీకి అనుమతి తీసుకుని మన ఫొటోలు లాగేసి న్యూడ్‌గా మార్ఫ్ చేసి నిలువునా దోచేస్తారు.

అప్రమత్తంగా ఉండాలి..

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాలని, మనీ ఆన్‌లైన్‌లో పోగొట్టుకుంటే తక్షణం 1930కు డయల్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. లోన్ యాప్‌ల జోలికి పోకూడదని హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన వారిని నమ్మడం మానుకోవాలని సూచిస్తున్నారు.మొబైళ్లు పోతే ఆన్‌లైన్ వెబ్‌సైట్ మొబైల్ ట్రేస్ యాప్ లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చు.

జాతీయ శిక్షణ శిబిరాలకు ప్రేమశ్రీ, కల్యాణి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి సెపక్‌తక్ర శిక్షణ శిబిరాలకు శ్రీకాకుళం జిల్లా నుంచి మహిళల విభాగంలో ఎస్.ప్రేమశ్రీ, పి.కల్యాణి ఎంపికయ్యారు. ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి సపక్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ఆటతీరును కనబర్చిన క్రీడాకారులను నేషనల్ మీట్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికచేశారు. వీరికి ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నారు. ఈ కోచింగ్ క్యాంప్‌లో రాణించిన ప్లేయర్స్ ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగే జాతీయస్థాయి సెపక్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళల జట్టుకు ఎంపికవుతారని జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి తెలిపారు. ఎంపికైనవారిలో శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రేమశ్రీ ఇంటర్ సెకండియర్ చదువుతుండగా శ్రీకాకుళం రూరల్ పాత్రునివలసకు చెందిన పి.కళ్యాణి డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. వీరిద్దరూ ఒంగోలు కోచింగ్ క్యాంప్‌లో చేరేందుకు శుక్రవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లారు. వీరిద్దరిని శ్రీకాకుళం సెపక్‌తక్ర అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి వీడ్కోలు పలికి అభినందించారు. పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించారు.



ప్రేమశ్రీ, కల్యాణిలను అభినందిస్తున్న ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, పక్కనే అర్జున్‌రెడ్డి

మహానటి..

ఆమె పేరు వినగానే పౌరాణిక రంగ స్థల ప్రేక్షకుల మది పులకిస్తుంది. ఆమె నటించే పౌరాణిక నాటకాల్లోని పాత్రలు చూసేందుకు ప్రేక్షకులు ఎగబడతారు. టెక్నాలజీ వచ్చి సినిమాలు అందుబాటులోకి వచ్చినా ఇప్పటికీ గ్రామాల్లో పౌరాణిక నాటకాలకు ఆదరణ కొనసాగుతూనే ఉంది. మూడు తరాల కళాకారులతో నటించిన ఆమె గాత్ర మాధుర్యం, నటనాభినయం అద్భుతం. పురుష కళాకారులను అధిగమిస్తూ పౌరాణిక రంగస్థలంలో ఇప్పటికీ తరగని ఆదరణ సొంతంచేసుకుని కళారంగానికి వన్నెతెస్తున్న కళాకారుల్లో ఆమే కిలారి లక్ష్మి. ఆమె స్వగ్రామం రాజాం. ఆరువేలకు పైగా పౌరాణిక కళా ప్రదర్శనలు ఇచ్చిన ఆమె పలు సత్కారాలు పొంది, ప్రేక్షకుల మదిలో మహానటిగా స్థానం సంపాదించింది.

–రాజాం



శ్రీకృష్ణుడి పాత్రలో కిలారి లక్ష్మి

- పౌరాణిక నాటకాల్లో పురుష వేషధారణలో రాణింపు
- 27 సంవత్సరాలుగా నాటకరంగంలో సేవలు
- 6వేలకు పైగా ప్రదర్శనలు
- పలు రాష్ట్రాల్లో గుర్తింపు
- శ్రీరాముడిగా, అర్జునుడిగా పాత్రలో పరకాయ ప్రవేశం

పౌరాణిక నాటక ప్రదర్శనల్లో వెలిగిపోతున్న కిలారి లక్ష్మి తెలుగు రాష్ట్రాలతో పాటు చుట్టు పక్కల రాష్ట్రాలకు కూడా చిరపరిచితురాలు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆమె చిన్నతనం నుంచే కళా ప్రదర్శనలు ఇచ్చేది. ఆడపిల్ల స్టేజీలపై ప్రదర్శన లేమిటని ప్రశ్నించినవారికి ఆదర్శ మహిళగా నిరూపించింది. తల్లిదండ్రులు ఆమెపై ఉంచిన నమ్మకాన్ని నిజంచేసేందుకు తన నటనకు కొత్త హంగులు దిద్దింది. పౌరాణిక నాటకాల్లో ఉండే స్త్రీ పాత్రలే కాకుండా ఏకంగా పురుష పాత్రలు పోషించేది. ఔరా అనిపించేలా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. పౌరాణిక నాటకాల్లో అర్జునుడు, రాముడు, సత్యహరిశ్చంద్రుడు పాత్రలు వేసి అందరినీ మెప్పించింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు మండలం గూనభద్ర ఆమె జన్మస్థలం. తల్లిదండ్రులు లలితాదేవి, సత్యనారాయణలు కూడా కళాకారులే. వారిద్దరి దగ్గర అల్లారుముద్దుగా పెరిగిన లక్ష్మి నాటకాలపై మమకారం పెంచుకుని చిన్నతనంలోనే తల్లిదండ్రులతో పాటు లవకుశ పాత్రల్లోనూ, లోహితాస్యుడు పాత్రలోనూ నటించేది.

తొలి అడుగు రాజాం నుంచే..

ఇంటర్మీడియట్ చదువుతో సరిపెట్టుకున్న లక్ష్మి నాటకాలవైపు దృష్టి సారించి, ఆరంభంలోనే పెద్ద పెద్ద కళాకారులతో నటించేది. ఆమె తొలి నాటక ప్రదర్శన రాజాం మండలం శ్యాంపురం గ్రామంలో జరిగింది. అక్కడ గ్రామ దేవత సంబరాల్లో సత్యహరిశ్చంద్ర నాటకంలో చంద్రమతిగా తొలి పద్యనాటక ప్రదర్శన ఇచ్చింది. వేలాదిమంది ఆరోజు అక్కడకు రాగా, చంద్రమతిగా పాత్రలో పరకాయప్రవేశం చేసి ఆద్యంతం కేరింతలు, చప్పట్లతో ప్రేక్షకుల మనసును గెలిచి తెలుగురాష్ట్రాల్లో తన పేరు మార్మోగేలా చేసింది.

కుటుంబసభ్యుల ప్రోత్సాహం

కిలారి లక్ష్మిలో పట్టుదల ఒక ఎత్తుకాగా, ఆమె భర్త చంటిబాబు సహకారం మరో కారణం. వివాహమైనంత వరకు చంద్రమతి పాత్రలు ఎక్కువగా పోషించిన ఆమె..భర్త ప్రోత్సాహంతో శ్రీరాముడు, కృష్ణుడు, అర్జునుడు పాత్రలు వేయడం ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, ఒడిశా, మద్రాస్ ప్రాంతాల్లో కూడా ఆమె అభినయం మంచి పేరును తెచ్చిపెట్టింది.



శ్రీరాముడిగా రంగస్థలంపై అభినయం

ఆరువేలకు పైగా ప్రదర్శనలు

ఎప్పుడో 27 సంవత్సరాల క్రితం స్టేజీపై అడుగుపెట్టిన లక్ష్మి ఇప్పటికీ నటనా జీవితాన్ని కొనసాగిస్తూనే వస్తోంది. తన గాత్రంపైనే నమ్మకం పెట్టుకున్న ఆమె ఇప్పటివరకూ 6 వేలకు పైగా నాటక ప్రదర్శనలు ఇచ్చింది. ఆమె ప్రస్తుతం రాజాంలోని వస్త్రపురికాలనీలో ఉంటున్నారు. ప్రదర్శన ఇచ్చిన ప్రతిచోటా ఆమెకు సత్కారాలు లభించాయి. నటగాన శిరోమణి, అభినవ చంద్రమతి, అభినవ సావిత్రి బిరుదులతో పాటు సువర్ణ ఘంటా కంకణం, 2016లో వెండి కిరీటం ఉత్తరాంధ్ర కళాకారులు బహుకరించారు. 2016లో కదుకూరి పురస్కారం లభించగా, నంది నాటక అవార్డులకు న్యాయ నిర్ణేతగా కూడా ఆమె వ్యవహరించారు.

పట్టుదల ఉండాలి



ప్రతి ఒక్కరికి ఏదో ఒక ప్రతిభఉంటుంది. పట్టుదలతో ప్రయత్నిస్తే అది సొంతమవుతుంది. నాకు ఆరంభంలో అవమానాలు ఎదురయ్యాయి. నా భర్తతో పాటు కుటుంబసభ్యులు ప్రోత్సహించారు. నా గాత్రాన్ని, ప్రతిభను నమ్మాను. దేవుడు కరుణించాడు. ప్రేక్షకులు ఆదరించారు. తెలుగు పౌరాణిక రంగస్థల చరిత్రలో కిలారి లక్ష్మి పేరుకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ జన్మకు ఇది చాలు.

కిలారి లక్ష్మి, పౌరాణిక రంగస్థల కళాకారిణి

ఘనంగా స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో మంగవిల్లి అమృషకి డిగ్రీ ప్రదానం చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం: వైద్యులు ప్రజాసేవ చేసేందుకు ఎంతో అవకాశం ఉంటుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో 2017 బ్యాచ్ వైద్య విద్యార్థులకు డిగ్రీ ప్రదానోత్సవం (స్నాతకోత్సవం) కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ తీసుకున్న విద్యార్థులు పీజీలు కూడా పూర్తి చేసి ఆరోగ్య సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఉత్సాహవంతమైన వాతావరణంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని చూస్తుంటే తాను చదువుకున్న రోజుల్లో స్నాతకోత్సవానికి హాజరు కాలేక పోవడం బాధ కలిగిస్తోందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం మాట్లాడుతూ వైద్య వృత్తి పవిత్రమైనదని, ఆరోగ్యం బాగుంటేనే ప్రజలు దేనినైనా సాధించగలుగుతారని అన్నారు. ఈ సందర్భంగా 2017కు చెందిన 99మంది విద్యార్థులకు డిగ్రీ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కోటేశ్వరరావు, ఫార్మకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతు ఆత్మహత్య

పాచిపెంట: మండలంలోని కేరంగి పంచాయతీ కొండమోసూరులో పురుగు మందుతాగి గిరిజన రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది వర్షాల కారణంగా గ్రామానికి చెందిన గిరిజన రైతు సోములు బోడియ్య జీడిమామిడి పంటకు నష్టం వాటిల్లింది. దీంతో అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు, మద్యం మత్తులో గురువారం ఉదయం పొలానికి వెళ్లి పురుగుమందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య, కుటుంబసభ్యులు సాలూరు సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు.

తల్లి చెంతకు బాలుడు

శ్రీకాకుళం క్రైమ్: రెండేళ్ల కిందట తల్లి నుంచి దూరమైన బిడ్డ మళ్లీ తల్లి పొత్తిళ్లకు చేరాడు. పోలీసుల కృషి, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సిబ్బంది చొరవ ఈ తల్లీబిడ్డలను కలిపింది. రెండేళ్ల కిందట బిడ్డను పోషించలేని స్థితిలో తల్లి వెళ్లిపోతే.. ఆ పసివాడిని ఆశ వర్కర్లు శ్రీకాకుళంలోని శిశుగృహాలో చేర్పించారు. ఆ బాలుడిని శిశుగృహ సిబ్బంది కంటికి రెప్పలా కాచుకున్నారు. అయితే అనాథ బాలలను అయిన వారికి చేర్చే కార్యక్రమం చేపడుతున్న మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సిబ్బంది ఈ బాలుడిని తల్లి చెంతకు చేర్చాలని తలచారు. ఇందుకోసం పోలీసుల సాయం తీసుకున్నారు. ఆ బాలుడి తల్లి మచిలీపట్నంలోని చిలకపూడి గ్రామంలో ఉన్నట్లు గుర్తించి.. జిల్లా బాలల సంక్షేమ సమితి సూచనల మేరకు బిడ్డను తల్లికి అప్పగించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం శ్రీకాకుళం మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసుల సమక్షంలో ఎస్పీ జీఆర్ రాధిక బిడ్డను తల్లి చెంతకు చేర్చారు. ఎస్పీ మాట్లాడుతూ బాలుడికి ఉన్నత విద్య అందించాలని, మంచి ప్రయోజకుడిని చేయాలని సూచించారు. బాలుడిని తల్లి వద్దకు చేర్చడంలో కృషి చేసిన ఏహెచ్‌టీయూ విభాగం పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు, ఏహెచ్‌టీయూ ఎస్ఐ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏహెచ్‌టీయూ పోలీసుల సమక్షంలో బాలుడిని తల్లి చెంతకు చేర్చిన ఎస్పీ రాధిక

61 మద్యం సీసాలు స్వాధీనం

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం గ్రామంలో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టుషాపుపై ఎస్సై బొడ్డు దేవి తన సిబ్బందితో శుక్రవారం దాడి చేసి మద్యం విక్రయిస్తున్న కె.సంతోష్‌ను అదుపులోకి తీసుకొని 61 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవి తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.



మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కళాకారులకు ఆహ్వానం

రాజాం: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సినిమా ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ స్థానిక తృప్తిరిసార్ట్‌లో ఈనెల 25, 26 తేదీల్లో ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు రిసార్ట్ ఎం.డి పీవీజీ కృష్ణ(మురళీమాస్టార్) శుక్రవారం తెలిపారు. 1971వ సంవత్సరం నేపథ్యంలోని వృత్తాంతంతో పిరియాడ సినిమా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సినిమాలో ప్రధాన పాత్రధారులు మినహా మిగిలిన పాత్రలన్నింటికీ స్థానిక ఉత్తరాంధ్ర కళాకారులను తీసుకుంటున్నట్లు వివరించారు. 200 మందికి పైగా కళాకారులను ఈ సినిమాకు ఎంపికచేయనున్నట్లు తెలిపారు.

గొట్టా బ్యారేజీ పటిష్టతకు చర్యలు

హిరమండలం: వంశధార గొట్టా బ్యారేజీ పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నట్లు వంశధార ఎస్ఈ డోల తిరుమలరావు అన్నారు. గతంలో వచ్చిన వరదలకు బ్యారేజీ దిగువ భాగాన కోతకు గురైన గట్టు ప్రాంతంలో సుమారు రూ.27 లక్షలతో నిర్మించనున్న గోడ రాతికట్టుకు సంబంధించిన అలైన్‌మెంట్ పనులు, వంశధార రిజర్వాయర్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.గొట్టా బ్యారేజీ నిర్మాణం చేపట్టి సుమారు 50 ఏళ్లు పూర్తయిందన్నారు. ఐదారేళ్లుగా మెయింటెనేస్ తగ్గిందని, గతంలో నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ వెళ్లిపోవడంతో పనులు ఆగిపోయాయని తెలిపారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే రెడ్డిశాంతి, మంత్రి ధర్మాన ప్రసాద రావు ప్రభుత్వానికి విన్నవించడంతో నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. బ్యారేజీని పూర్తి స్థాయిలో ఆధునికీకరణ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డ్రిప్ కింద రూ.25 కోట్లు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.



వంశధార కోతకు గురైన గోడ నిర్మాణ అలైన్‌మెంట్ పనులు పరిశీలిస్తున్న వంశధార ఎస్ఈ తిరుమలరావు

ఆగస్టు నాటికి ఎత్తిపోతల పథకం పూర్తి

గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు మూడు ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. ఈ పథకం పనులకు మొదట విడతగా రూ.140కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ పనులు ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నామన్నారు. లిఫ్ట్ పనులు పూర్తయితే 10 నుంచి 12 టీఎంసీల నీటిని రిజర్వాయర్‌కు మళ్లించి రెండు పంటలకు సాగునీరు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో వచ్చే వరదలకు ఇక్కడి నుంచి నీటిని తోడే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు డీఎస్ఈ ఎంవీ రమణ, ఈఈ ప్రదీప్ కుమార్, డీఈలు అనిల్ కుమార్, సతీష్, ఏఈలు సత్యనారాయణ, పరిషిద్ బాబు, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.